
# బ్రహ్మచారి

శాంతిప్రియ



*"స్త్రీ సమక్షంలో ఎంతటి నిగ్రహశక్తి అయినా క్షణంలో సడలిపోవడానికి అవకాశం ఉన్నది. మనోబలం, ఇంద్రియ నిగ్రహం ఉన్నవని భ్రమించి గర్వించువానికి పతనం తప్పదు." వ్యాస భగవానులు శిష్యబృందానికి చేసిన హెచ్చరిక ఇది. ఇంద్రియ నిగ్రహి ఏ పరిస్థితులలోనూ స్త్రీ సమ్మోహన శక్తికి లొంగిపోడని జైమిని వాదం. వాదోపవాదాలు వేరు; పరీక్షకు నిలబడడం వేరు కదా!*

మనోజ్ఞ ప్రకృతి రామణీయకం వెల్లివిరిసిన ప్రశాంత ప్రదేశంలో పవిత్రగంగా నదీతీరంలో పూజ్యుడూ పురాణపురుషుడూ సాక్షాత్ భగవత్ స్వరూపుడూ అయిన వ్యాసమహర్షి ఆశ్రమం వెలసి ఉన్నది. ఆ ఆశ్రమంలో స్వార్థపరిత్యాగులు సత్కార్యానుష్ఠానదీక్షాయుతులు పరోపకారరతులు దేహాభిమాన విధ్వంసకులు విధ్యుక్తధర్మకర్మానురంజకులు అయిన పెక్కుమంది యువకులు వ్యాస భగవానుని శిష్యులై అతని కనుసన్నలలో మెలగుతూ సర్వకాలసర్వావస్థలలో గురుదేవులను సేవిస్తూ అమూల్యమైన తమ కాలాన్ని వేదాధ్యయనంలోను పరమాత్మ స్వరూపారాధనాదులలోను గడుపుతూ ఆశ్రమధర్మబద్ధులై జీవితాలను సార్థకం చేసుకొంటున్నారు.

ఆశ్రమాన్ని అంటిపెట్టుకొని ఒక నిర్మల జలాశయమూ దానిప్రక్కనే పరమేశ్వరారాధనోపయుక్తములగు పత్రపుష్పఫలరాసులకు నిలయమైన ఒక చక్కని వనము ఉన్నాయి. సర్వసంగపరిత్యాగులైన ఆశ్రమవాసులకు అది వాసయోగ్యమైన స్థలమని చెప్పడంలో అతిశయోక్తి ఎంతమాత్రమూ లేదు.

గభీర శుభ సంప్రార్థనా గీతాలతోను వేదోపనిషత్తుల పారాయణ ఘోషలతోను అనారతం నిత్యమూ కలకలలాడుతూ మనస్సుకు ఆలౌకికానందాన్ని కలుగజేస్తూ ప్రశాంత పవిత్రతలను భద్రపరుస్తున్నది.

అదియొక వసంత సుప్రభాత సమయం. చంచల స్వరూపిణియు మాయావియునైన ప్రకృతికాంత విలాసభాసురయైన క్రొత్త పెళ్లికూతురువలె వింతదుస్తులను ధరించి నూతనాలంకారములతో వసంతానురక్తయై సర్వత్రా విహరిస్తూ వాతావరణంలో నవీన చైతన్యం కలుగజేస్తున్నది.

ఆశ్రమవనంలోని పక్షుల కిలకిలారావాలు మనస్సున గిలిగింతలు పెట్టుతూ ఆనంద ప్రపుల్లితం చేస్తున్నాయి. సౌరభవాహియైన గంధసమీరుడు నితాంత ప్రమోదభరిత హృదయంతో జీవకోటికి వసంతాగమనాన్ని చాటిచెబుతున్నాడు. పరిసర వృక్షజాలాలు కుసుమిత లతాంత మంజరీ విలసితాలై సుగంధాన్ని ఎటువైపులా వెదజల్లుతున్నాయి. వసంత డోలికలో ప్రకృతి కాంత వయ్యారంగా ఊయలలూగుతూ మృదుమధుర శైలిలో ప్రభాతగీతిక ఆలాపిస్తున్నది.

విశాల నీలి సుందర గగన మండలంలో తన విధ్యుక్తధర్మాన్ని నిర్వహించేందుకు సూర్యభగవానుడు తూర్పుదిశలో బయలు దేరుతున్నాడు. ఆ మనోహరసమయంలో ఆశ్రమవాసులు వ్యాసమహర్షిని పరివేష్టించి భక్తిశ్రద్ధలతో వేదాంతసారాన్ని మనసారగ్రోలేందుకు ఉవ్విళ్ళూరుతున్నారు. వారిమధ్య దర్భాసనంపై పద్మాసనాసీనులై వ్యాసమహర్షి స్వరచితమై బహుపత్రపూర్ణమైన ఒకతాళపత్ర గ్రంధాన్ని దీక్షగా పరిశీలిస్తూ గ్రంధపఠనం మౌనంగా సాగిస్తున్నారు. ప్రకాశవంతమైన అతని ముఖం నిర్మలమై శాంతినిలయమై మహత్తరమైన అతని శక్తిని అయాచితంగా ప్రకటిస్తున్నది. గురుదేవుల నోటినుండి వీక్షణాన ఏ విషయం వెలువడుతుందో అని శిష్యులంతా చెవులు రిక్కించి ఏకాగ్రచిత్తంతో నిశ్శబ్దంగా కూర్చున్నారు.

ఆశ్రమవాసుల దైనందిన కార్యక్రమాలలో ఉదయ సంధ్యలు వేదాంత బోధనకు ప్రత్యేకించ బడ్డాయి. ఆ నిర్ణీత సమయాలలో శిష్యగణమంతా వ్యాసుని చుట్టూ చేరి ఆయన బోధించే విషయాలను శ్రద్ధగా వినడం పరిపాటి. శిష్యులు తమ సందేహాలను నిరభ్యంతరంగా నిస్సంకోచంగా వెలువరించి తగు సమాధానాలు పొందుతూ సంతృప్తమానసులవడం కూడా కద్దు. సందేహాలను వెలువరించడంలో వారికి సంపూర్ణస్వేచ్ఛ ఉందంటే ఆశ్చర్య పడవలసిన అవసరం లేదు. అతీతశక్తి సంపన్నులైన వ్యాసమహర్షి వారి సందేహాలను నిదర్శనాలతో కూడిన సమాధానాలతో నివృత్తిచేస్తూ వారికి నవీనోత్సాహాన్ని కల్గిస్తూ ఉంటారు.

ఆదినం కూడా యథావిధిగా 'వేదాంత బోధన జరుగుతూ ఉంది. గ్రంథపఠనంలో లీనమై ఉన్న వ్యాసమహర్షి తలెత్తి ఒక్కమారు కలయజూచి సహజ మృదుమధుర గంభీరస్వరంతో శిష్యులను ఉద్దేశిస్తూ ఇలా అన్నారు:

"సాధనలన్నింటిలోను బ్రహ్మచర్య నిర్వహణం చాల ముఖ్యమైనది. బహు పవిత్రమైనదే కాక కష్టతరమైనది కూడా. దీనిని విజయవంతంగా నిర్వహించాలంటే అపరిమితమైన మనోబలం అకుంఠిత ఇంద్రియ నిగ్రహశక్తి అవసరం. ఆశ్రమవాసులకు ఇది ఒక అమూల్యాభరణం. బ్రహ్మచర్య శిక్షావిహీనులు ఆశ్రమవాసానికి యోగసాధనకు అనర్హులు. చంచల మనఃప్రవృత్తిని నిజశక్తిచే బంధించి క్షుద్రమైన లైంగిక వాంఛలనుండి మరలించి నిత్యానందకరమైన బ్రహ్మస్వరూపంవైపు కేంద్రీకరించి యోగాభ్యాసం చేయువాడు నిశ్చయంగా మోక్షం సాధించగలడు. నిశ్చల నిర్మల బ్రహ్మచారికి ముల్లోకాలలో సాధించలేనిదంటూ ఉండదు. అయితే కోటానుకోట్ల మానవులలో కూడా ఒక పవిత్ర బ్రహ్మచారి ఉండటం కష్టం. నానావర్ణ ప్రశోభితమైన ఈ మాయ భిన్నరూపాలలో శాశ్వతానందం కలుగజేస్తున్నట్లు మరు మరీచికల వెరగొందిస్తూ ఒక విధమైన అజ్ఞానతిమిర భ్రాంతిని కలగజేసి ఈ మానవకోటిని చిరకాలంనుండి మోసగిస్తున్నది. ఈ విచిత్ర మాయాజాలపు ఆకర్షణశక్తి అత్యంతబలీయము. మోక్షద్వార నిరోధకం. విజ్ఞాన విధ్వంసకము. కాబట్టి మీరందరూ అతి జాగ్రత్తగా మసలుతూ బ్రహ్మచర్యదీక్షను విజయవంతంగా నిర్వహించడానికి కృషిచేయాలి. ఇందుకు ముఖ్యంగా స్త్రీ సాన్నిధ్యానికి సాధ్యమైనంత దూరంలో ఉండటం ఎంతైనా అవసరం. స్త్రీల సమక్షంలో ఎటువంటి నిగ్రహశక్తి అయినా క్షణంలో సడలిపోవడానికి అవకాశం ఉంది. మనోబలం ఇంద్రియనిగ్రహం ఉన్నవని భ్రమించి గర్వించువానికి పతనం తప్పదు."

వ్యాసమహర్షి తమ వేదాంతోపన్యాసానికి కొంచెం విరామం ఇచ్చి మరొక్కసారి మళ్లీ కలయ జూశారు.

శిష్యుల మధ్య గుసగుసలు ప్రారంభమైనవి. అతి తగ్గుస్థాయిలో వాళ్లు తమలో తాము ఏదో విషయమై తర్కించుకొంటున్నారు. వ్యాసమహర్షి ఇది గ్రహించి అతి ప్రశాంతంగా అన్నారు:

"విద్యార్థులు ఏదో వాదించుకొంటున్నట్లున్నారు. విషయం ఏమిటో మేము తెలుసుకొనవచ్చునా?"

ఒక్కసారిగా గుసగుసలు ఆగిపోయాయి. క్షణకాలం అందరి మధ్యా నిశ్శబ్దం తాండవించింది. అంతలోనే శిష్య సమూహంనుండి జైమిని అనే శిష్యుడు లేచి వినయ విధేయతలను ప్రకటిస్తూ భక్తిభావంతో ముకుళిత హస్తుడై ఇలా అన్నాడు:

"గురుదేవుల ప్రసంగానికి తాత్కాలికంగా అడ్డు తగిలిన ఈ జ్ఞానహీనుని మన్నింతురు గాక. భగవాన్ ! మీ పలుకులు సత్యదూరములని వాదించేపాటి సాహసం నాలో లేకపోయినా అల్పజ్ఞానినైన నేను ఒక్క విషయాన్ని మాత్రం అంగీకరించలేకుండా ఉన్నాను. స్త్రీల సమక్షంలో ఎటువంటి నిగ్రహశక్తి అయినా క్షణంలో సడలిపోవడానికి అవకాశం ఉందనడం అంత సమంజసంగా కనిపించడం లేదు. సుస్థిర సంకల్పుడు విషయవిరక్తుడు ఇంద్రియ నిగ్రహి అయిన వ్యక్తి ఏ పరిస్థితులలో కూడా స్త్రీ సమ్మోహనశక్తికి లొంగిపోడని నేను వాదించగలను."

వ్యాసమహర్షి ఎందుకో కొద్ది క్షణాలు

కన్నులు మూసుకొని గంభీర మౌనముద్ర వహించారు. తర్వాత కన్నులు విప్పి జైమినిని ఉద్దేశించి, "నాయనా జైమినీ ! బ్రహ్మచర్యం అంటే ఏమిటి ?" అని ప్రశ్నించారు.

"మనోవాక్కాయ కర్మల ద్వారా లైంగిక వాంఛల కతీతులై పవిత్రత నుపాసించడం"

## బ్రహ్మచారి

అన్నాడు జైమిని.

"అవును. అయితే అది అంత సులభ సాధ్యమని అనుకుంటున్నావా? కామసామ్రాజ్యాధిపతి కందర్పుడు. అతని పుష్పధనస్సు నుండి వెలువడే వాడితూపులు ఎంతటి నిశ్చల చిత్తాన్నైనా చలింపజేసి వికారానికి గురిచేస్తాయి. మెలకువ గలిగి వాటి ధాటికి చలించక తట్టుకొన గలిగిన ధీరచిత్తుడే పవిత్ర బ్రహ్మచారి."

జైమిని ఉత్సాహంగా "చిత్తం. తమ క్రమశిక్షణవల్ల అటువంటి యువకులు పెక్కుమంది తమ శిష్య గణంలో ఉన్నారని తెలియజేయడానికి గర్విస్తున్నాను" అన్నాడు. వ్యా స మ హ ర్షి ముఖంలో చిరునవ్వు లీలగా తోచింది. "ఇది నిజంగా గర్వించతగ్గ విషయమే....గాని..."

వాక్యం ముగియక ముందే జైమిని నగంలో అడ్డు తగిలి "గురుదేవులు శంకిస్తున్నారా?" అని ప్రశ్నించాడు.

"శంకించడం అనుచితం కాదనుకుంటాను. మా శిష్యబృందంలో పెక్కు మంది బ్రహ్మచారులున్నారని నువ్వు ఎలా చెప్పగలుగుతున్నావు? అది అంత సులువుగా నిర్ణయించవలసినవిషయం కాదు జైమినీ! ప్రతి వ్యక్తికి ఒక్కొక్క పరిస్థితిలో భగవంతుడు ఒక్కొరకమైన విషమ పరీక్ష కల్పిస్తుంటాడు. అందులో విజయం సాధించ గలిగిన వ్యక్తికే నేను చెప్పిన పవిత్రత వర్తిస్తుంది. కేవలం అభినయ పూర్వకమైన ఆచార వ్యవహారాదులచే ఎదుటివారి మనోభిప్రాయాన్ని నిర్ణయించడం అవివేకం. ఏ ప్రత్యక్ష నిదర్శనాలను పురస్కరించుకొని నీవు ఇటువంటి నిర్ణయానికి రాగలిగావో దురూహ్యము" అన్నారు వ్యాస భగవానులు.

జైమిని అదోవదనుడై మెదలకుండా ఊరుకున్నాడు. మిగతా శిష్యు లందరూ తలలు వంచుకొని గంభీర మౌన ముద్ర వహించారు.

వ్యాస మహర్షి తన సహజ గంభీర స్వరంతో ఇట్లు ప్రసంగించారు. "శిష్యులారా! మిమ్మల్ని అవమానించడం నా ఉద్దేశ్యం కాదు. మీలో మహా జ్ఞాన సంపన్నులు, ఇంద్రియ నిగ్రహులు, పవిత్ర బ్రహ్మచారులు ఉన్నారో లేదో అనే విషయంపై వితండవాదం చేయడం అవాంఛనీయం. ఎవరి పవిత్రత వారి మోక్ష సాధనకు చేయూత నిస్తుందనేది మీకు తెలియనిది కాదు. అసత్య అభినయం ద్వారా ఇతరుల మెప్పును కాంక్షించడం కేవలం అవివేకం. ఆ వ్యక్తికి అందువల్ల ప్రయోజనమంటూ ఏమీ లేకపోగా తిరిగి తన వ్రేలితో తన కండ్లనే పొడుచుకున్నట్లవుతుంది. మీ పవిత్రతకు భంగం వాటిల్లకుండా చూచుకోవడం మీ విధి. నా కర్తవ్యాన్ని నిర్వహిస్తూ తద్వారా మీకు కర్తవ్యాన్ని ఉపదేశించడం నాయొక్క ముఖ్య ధర్మం. నా ఉపదేశాలను మన్నించి తరిస్తారనే పూర్ణ విశ్వాసం నా కున్నది."

గురుదేవుల వాగ్ధోరణికి అందరూ మంత్ర ముగ్ధుల్లా మౌనంగా ఉండిపోయారు. జైమిని ముఖంలో మాత్రం ఎందుకో అసంతృప్తి జీరాడుతున్నట్లు గ్రహించి, వ్యాస మహర్షి తనలో తను నవ్వుకున్నాడు.

తర్వాత ఉన్నట్లుండి హఠాత్తుగా వ్యాస మహర్షి అన్నారు: "జైమినీ! నువ్వు పవిత్ర బ్రహ్మచర్య దీక్షను నిర్వహిస్తున్నా నంటావా?"

ఆ ప్రశ్నకోసమే ఎదురుచూస్తున్నట్లు జైమిని తడుముకోకుండా జవాబిచ్చాడు. "తమ అనుగ్రహంవలన అందులో లోపం జరగడం లేదని మనవి చేసుకుంటున్నాను" అన్నాడు జైమిని నిశ్చలంగా. ఆ మాటలలో కొంచెం గర్వం తొంగి చూచి మళ్లీ మాయమైంది. ఇది గ్రహించినట్లు వ్యాసమహర్షి నవ్వుతూ, "చాల సంతోషిస్తున్నాను జైమినీ. మిగతా శిష్యులుకూడా నీవలె పవిత్ర బ్రహ్మచర్య దీక్షను కొనసాగిస్తూ శాశ్వత ముక్తి సాధనకు పునాదులు వేసుకుంటారని ఆశిస్తున్నాను. అయినా ఆ ఖ రి సా రి గా మళ్లీ ఒకసారి అందరనూ హెచ్చరిస్తున్నాను. సాధ్యమైనంతవరకూ స్త్రీ సాన్నిధ్యం నుండి తప్పించుకొని యువతులకు బహుదూరంగా ఉండడమే అన్ని విధాల శ్రేయస్కరం" అంటూ ముగించారు.

• • •

కొన్ని రోజులు ప్రశాంతంగా గడిచిపోయాయి.

ఒక రోజు దండ కమండల సహితుడై ఎక్కడికో వెళ్లడానికి బయలుదేరుతూ శిష్యులతో వ్యాసమహర్షి ఇలా అన్నారు:

"అత్యవసరంగా కొండొక కార్యార్థం స్వయంగా వెళ్లవలసి వచ్చింది. తిరిగి వచ్చేసరికి రెండు మూడు రోజులు కావచ్చును. అంతవరకూ మీరు ఏ లోపం లేకుండా మీ మీ కర్తవ్యాలను నిర్వహించవలసింది."

తర్వాత ప్రత్యేకంగా జైమిని వైపు చూచి చిరునవ్వుతో వ్యాసమహర్షి అన్నారు:

"వెళ్లిరానా జైమినీ?"

జైమిని శ్రద్ధాంజలి ఘటించి భయభక్తులతో "చిత్తం" అని అన్నాడు. వ్యాసమహర్షి నేత్రద్వయంలో ఏదో హెచ్చరిక మెరసింది. జైమిని అది అసలు గుర్తించనేలేదు.

• • •

సంధ్యారుణకాంతులు మందంగా పాలిపోతున్నాయి. వాటి స్థానే నిశాకన్య తల విరియబోసుకొని తన ఘన కృష్ణకేశరాశిని అనంత విశ్వంలో ఆరబెట్టు కుంటున్నదేమో అనేటట్లు చీకటి చాయలు నలువైపులా వ్యాపిస్తున్నాయి.

నిర్మలాకాశంలో తూర్పు దిశను కొన్ని నల్లని మేఘ శకలాలు చెదురుగా గాలిలో తేలియాడుతున్నాయి. కమలాకరుడు తన మాతృదేవి కౌగిలిలో విశ్రాంతి తీసుకునేందుకు పశ్చిమ గిరి మరుగున మాయమయ్యాడు. ఒక్కసారిగా అంతటా దట్టమైన చీకటి అలముకొంది. పేలవంగా ఉన్న చవితి చంద్రుని లేతవెన్నెల చిక్కని చీకటిని పారద్రోలలేక అపజయాన్ని అంగీకరించి ఒక


# తరచుగా మూత్ర విసర్జన

**తరచుగా** మూత్రం విసర్జించడం ప్రమాదకరమైన చిహ్నం. అది శరీర తత్వాన్ని ధ్వంసం చేయడమే కాకుండా, రోజు రోజుకు రోగిని మృత్యు సమీపానికి తీసుకువస్తుంటుంది. ఆరంభంలో శారీరకంగా కానీ, మానసికంగాకానీ శ్రమపడడానికి అయిష్టత, నడుం నొప్పి, దృష్టి మాంద్యం, తొడలవద్ద తిమ్మిరి, సర్వసాధారణంగా బలహీనత మొదలైన లక్షణాలు కనబడుతూవుంటవి. ఈ లక్షణాలు గోచరించటంతోనే తగిన చికిత్స చేయకపోతే, వుత్తరోత్తరా అమితదాహం, ఆకలి, నోరు, గొంతు ఎండుకపోవుట, దురద, కాళ్లలో సంకటం, బరువు తగ్గటం, శరీరమంతా పోట్లు, కీళ్లవాతం, కళ్ల పొర, టి. బి, కురుపులు, రాచపుండు, ఇదితర తీవ్రవ్యాధులకు గురికావలసి వస్తుంది. "వీనస్ చారం" బిళ్లలు వాడి వేలాది మంది శమనంపొంది మృత్యుహాతపడకుండా తప్పించుకున్నారు. "వీనస్ చారం" బిళ్లలు ప్రాచీన యూనాని వైద్యసిద్ధాంతం ప్రకారం శాస్త్రీయంగా అరుదైన మూలికలతోను, వనస్పతుల సారములతోను, స్వాభావికమైన క్షారములతోను తయారుచేయబడ్డవి. ఈ చికిత్స మొదలుపెట్టిన రెండవ, లేదా మూడవరోజునుంచే అమితదాహం తగ్గి, తరుచుగా మూత్రవిసర్జన చేయుటం నిలిచిపోతుంది. కొద్దిరోజులలోనే మీకు సగానికి పైగా స్వస్థత చేకూరినట్లనిపించును. "వీనస్ చారం" ఖర్చు తక్కువ. నిరపాయమయినవి. తీసుకొనడం సులభం. ప్రత్యేక కటినపథ్యాలుకానీ, ఉపవాసాలు చేయవలసిన అవసరంకానీ వుండవు. రోగులు పుష్టికోసం బలప్రవర్ధకమైన వివిధపదార్థములను భుజించవచ్చును. కోరినవారికి పూర్తివివరాలుకల సారస్వతం ఇంగ్లీషులో పంపబడును. 50 బిళ్లల ఖరీదు 6.75 న.పై. మాత్రమే. పోస్టేజి నిమిత్తము రూ. 1—6. న.పై. అదనము. (ఒకేసారి రెండు, అంతకు పైగా, సీసాలను తీసుకున్న పోస్టేజి వుచితం.) దొరకు చోటు :

**Venus Laboratories (A.H.W.)**
**Post Box 587, Calcutta.**

జలధరం చాటుకు వెళ్లిపోయింది.

వ్యాసమహర్షి శేవందువలన ఆశ్రమంలో ఉదయాస్తమయ సమయాలలో జరిగే వేదాంత గోష్ఠికి తాత్కాలిక విరామం ఏర్పడింది. అయితే జైమిని మాత్రం ఆ సమయాన్ని వ్యర్థపుచ్చడం లేదు. ఆ నాటి సాయంత్రం అతడు ఆశ్రమాని కవతి దూరంలో ఉన్న ఒక ఏకాంతప్రదేశంలో కూర్చుని సర్వేశ్వరుని పాదపద్మాలను మనస్సులో ప్రతిష్ఠించి ప్రార్థన చేసుకుంటున్నాడు.

భగవద్ధ్యాన నిమగ్నమ్మైన అతని మనస్సు బాహ్య ప్రపంచ స్పర్శకు అందకుండా పరమాత్మలో లీనమై నిశాకన్యక ఆగమనాన్ని అసలు గమనించనేలేదు.

ఇంతలో హఠాత్తుగా కన్నులు మిరుమిట్లు గొలిపే మహోజ్జ్వల కాంతితో తూర్పు దిక్కునొక మెరుపు బంగరు తీగెలా తళుక్కున మెరసి మాయమైంది. దాని వెంటనే బ్రహ్మాండమైన శబ్దం వినిపించి భూమిని జవజవలాడించింది. చెవులు చిల్లులు పడేటట్లున్న ఆ పెను శబ్దానికి జైమిని ధ్యాననిష్ఠకు భంగం కలిగింది. అతడు త్రుళ్లిపడి కన్నులు విప్పి చూచాడు. భక్తి పారవశ్యావనిక ప్రక్కకు తొలగి ప్రకృతి యథార్థస్వరూపం అతని కంట బడింది. ఆ వాతావరణంలో ఏదో వైపరీత్యాన్ని శంకించి జైమిని తత్ప్రదేశాన్ని తొందరగా విడిచి పోవాలనే సంకల్పంతో తనధ్యానాసనం నుండి లేచి ఆశ్రమాభిముఖుడై బయలుదేరాడు.

చెదురుగా ఉన్న మేఘ శకలాలు విజృంభించి క్షణ క్షణానికీ విపరీతంగా వృద్ధికాజొచ్చినై. చల్లని నీటి వాయువులు వానరాకను సూచిస్తూ వృక్ష సమూహాలతో దోబూచులాడుతున్నాయ్. మనోహరమ్మైన వసంత ప్రకృతి కాంత చీకటి ముసుగు మరుగున చింతాక్రాంతయ్యై బొంగురువోయిన కంఠస్వరంతో విలపిస్తున్నదేమో అనేటట్లు రెమ్మల గాలులు మర్మరధ్వని చేస్తున్నవి.

ఆకసం పరిపూర్ణ మేఘావృతమ్మై అంధకారాన్ని ద్విగుణీకృతం చేసింది. గాలి విసురుకు పరిసర తాళవృక్షాలు శివమెత్తినట్లు ముందుకు వెనుకకు ఊగిసలాడుతున్నాయ్.

జైమిని గమనవేగం హెచ్చించాడు. అయినా నడక మందంగా భారంగా సాగుతున్నది. గాలి ప్రవాహానికి ఎదురీదడం అతనికి కష్టతరమ్మై పోయింది. పైగా ధూళి ధూసరమ్మైన గాలి ఫలితంగా కన్నులు తెరువడానికే వీలు కలగడం లేదు.

సన్నటి నీటి తుంపరలతో ప్రారంభమ్మైన వాన జల్లు క్రమంగా అభివృద్ధి చెంది క్షణంలో హోరుమని కుండపోతగా కురువ జొచ్చింది. జైమిని సర్వాంగాలు పూర్ణ జలాభిషిక్తములయ్యాయి. అతని కాళ్లు బురదలో కూరుకుని పోతున్నాయి. అయినా తన ప్రయత్నం విడువక మెల్లగా ముందుకు సాగిపోతున్నాడు.

హఠాత్తుగా అతని గమనానికి తాత్కాలిక ప్రతిబంధకం ఏర్పడింది. విద్యుల్లతల కాంతి అతని దృష్టికి బాటప్రక్కనే ఉన్న ఒక వటవృక్ష మూలాన్ని ఆశ్రయించుకొని ఒక మానవాకారం ఉన్నట్లు గోచరించింది. అతడు కన్నులు చిన్నవిగా ముడిచి దృష్టిని ఆకారం వైపు కేంద్రీకరించి మరీ చూచాడు. అది ఒక స్త్రీ మూర్తి అని తెలుసుకోడానికి అతనికి ఎంతోసేపు పట్టలేదు. అయితే ఈ భయంకర నిర్జనారణ్యాంతర్భాగానికి ఈ నిశీథవేళ ఆమె ఎలావచ్చిందో ఎందుకు వచ్చిందో అతనికి అర్థం కాలేదు.

బహుశా ఆమె దారితప్పి ఇటు వచ్చి ఉంటుందని అతడు అనుకోవలసి వచ్చింది. ఈ ఆపత్సమయంలో ఆమెను ఆదుకొని తగిన సహాయం చేయడం తన కనీస ధర్మంగా అతడు భావించాడు.

మెల్లగా వటవృక్షం సమీపించాడు. అతని రాకను గమనించి అయ్యన్నులమిన్న వేటకాని చూచిన లేడిలా బెదిరి ప్రక్కకు తప్పుకుంది. ఆమె ఎందుకో కంగారు పడుతున్నట్లు గుర్తించి జైమిని శాంతస్వరాన ఇలా అన్నాడు:

''సోదరీ! నేను ఆశ్రమవాసిని. నన్ను చూసి భయపడవలసిన అవసరం లేదమ్మా. కేవలం నీకు సహాయం చేద్దామనే ఉద్దేశ్యంతోనే ఇటు వచ్చాను. అంతకంటే మించిన అసంగత ఉద్దేశమేమీ లేదు.''

ఆమె మెదలకుండా ఊరుకున్నది. ఆ మౌనాన్ని పురస్కరించుకొని జైమిని మళ్లీ కలుగజేసుకున్నాడు.

''దారితప్పి చాలాదూరం వచ్చినట్లున్నావు. మీ నివాసస్థలం ఎక్కడున్నదో గుర్తులు తెలిపితే నిరభ్యంతరంగా భద్రంగా అక్కడకు నిన్ను చేర్చగలనని వాగ్దానం చేస్తున్నాను'' అన్నాడు.

చెట్టు మొదలు ఆనుకొని ఆమె అధోవదనయ్యై నిల్చొని ఉన్నది. ధారాపాతంగా కురుస్తున్న వర్షపు ధ్వనితో మిళితమ్మై జైమిని మాటలు ఆమెకు చాలా తగ్గుస్థాయిలో వినిపించాయి. అయినా ఆమె వాటి భావాన్ని గ్రహించినట్లే కనిపించింది.

నిర్విరామంగా క్షణభంగురమ్మైన తళత్తళలతో మెరిసి మాయమౌతున్న మెరుపుల కాంతిలో జైమిని ఆమెను పరిశీలనగా చూశాడు. ఆ చూపులో విపరీతమేమీ లేదు. అలా చూడడం తప్పేమోనన్న భావం కూడా అతనిలో కలుగలేదు. నిర్వికారచిత్తంతో మాత్రమే అతడామెను అవలోకిస్తున్నాడు.

నవయవ్వనశ్రీవిరాజితాలైన ఆమె సర్వాంగాలు పరిణతములై మనోహరంగా కన్పిస్తున్నాయి. స్వర్ణరసరంజితాలైన ఉదయకిరణాలను దిక్కరిస్తున్నట్లు ఆమె శరీరకాంతి పసిడి నిగ్గులు వెలవరిస్తున్నది. యవ్వన సొంపులతో ఒంపులు దీరిన ఆమె శరీర సహజ సౌందర్యాన్ని మరుగు పరచడానికి వర్షంలో తడిసిన ఆమె చీరవ్యర్థ ప్రయత్నం చేస్తున్నది. ఆజానులంబితమ్మైన ఆమె కేశరాశి నీరోడుతూ ఆమె ఆకారానికి మరింత వన్నె దెచ్చింది.

అయితే, ఆమె సౌందర్యాతిశయానికి జైమిని ముగ్ధుడు కాలేదు. అతని మనస్సులో వికార సంచలనమేమీ బయలుదేరి తుఫాను లేవదీయలేదు. అతని హృదయం మోహావిష్టమ్మై పరవళ్లు త్రొక్కలేదు. నిగ్రహబద్ధమ్మైన అతని ఆత్మ హద్దు మీరి విరుచుకు పడలేదు.

కాని. . . .

రస విహీనమ్మైన చిరునవ్వుతో అతడు ఆమెను చూస్తూనే ఉన్నాడు. ఆ చూపు ఆమెను తూపులా దూసుకుపోయి ఎక్కడో వేదాంత వీధిలో విహరిస్తూ అతనికి జ్ఞానోదయం కలుగజేస్తున్నది.

''ఇంత అందంగా సృష్టించబడిన ఈఆకారం ఏమిటి? కొన్నాళ్లకు ఈ అందమంతా ఏ మౌతుంది? దుర్గంధ భూయిష్ఠమ్మైన ఈ మాంస గోళానికి ఇంత ఆకర్షణ శక్తిని ఎవరిచ్చారు? దీనివలన ఎవరికానందం? యువ్వనోద్రేక సహజాహంకార గర్వితయ్యైన ఈ జవ్వని వార్ధక్యంలో ఎలాగుంటుందో కదా? పాలనురుగులా మిలమిలలాడుతున్న ఈమె చెక్కిళ్లు ముసలితనంలో సొట్టలుదేరి ఎంత జుగుప్సాకరంగా తయారవుతాయో కదా! ఒంపులుదిరిగి మలచిన శిల్పంలా ఉప్పటువంటి ఈమె శరీరం తుదకు ఎండినచర్మం కప్పుకొన్న బొమికెల గూడులా మారవలసిందే కదా! తప్పదు. ఇదంతా ఒక విచిత్రమ్మైన ఇంద్ర

### కుక్క కాటుకు చెప్పుదెబ్బ

ఎన్నడూ లేనిది శేఠ్ జీ పగలు దుకాణం మూసి బయలుదేరుతూ ఉన్నారు.

"ఏమండీ, శేఠ్ గారూ! ఎక్కడికి ప్రయాణం" అని ఒకరు అడిగారు.

"పొరుగూరుకు వెళ్ళి కార్డు కొందామని" అని సమాధానం చెప్పాడు శేఠ్ జీ.

"మన ఊళ్ళోనే ఉందిగదా పోస్టాఫీసు!" అని మరొకరు అన్నారు.

శేఠ్ గారు చిరునవ్వుతో ఇలా చెప్పారు : "మన ఊరి పోస్టు మాస్టరు మా దుకాణంలో సరకులు ఎప్పుడూ కొనరండీ. ఆలాంటప్పుడు నేను ఆయన దగ్గర ఎందుకు కొనాలి!"

—జె. బి. ఆర్. ప్రభాకర్
(పెదకూరపాడు)

జాలం. ఈ మాయను ఛేదించుకొని బయట పడటం అంత సులభసాధ్యమైన విషయం కాదు. ఎంత అందం ఉన్నా జరామరణాలు తప్పవు. మృత్యుదేతకు అందం వయస్సు ఉత్కృష్ట నీచాదులతో ప్రమేయం లేదు. అది అందరినీ ఒక దృష్టితో చూస్తుంది. తారతమ్యాలు గణించక పక్షపాత రహిత బుద్ధితో అందరిని తన కౌగిలిలో ఇముడ్చుకుంటుంది. యవ్వనం త్రుంచిన పువ్వులా వాడిపోవలసిందే! సౌందర్యం కృష్ణపక్ష చంద్రునిలా దినదిన క్షయం పొందుతూ కడకు అమావాస్య రేయిలా అంతరించిపోవలసిందే! వీటికి తిరుగు లేదు....''

అతని ఆలోచనలు ఈ కోవలో విజృంభిస్తున్నాయి. అతడు తన ప్రస్తుత కర్తవ్యాన్ని మరిచిజీవితపులోతుల్లోకిపోయి ఆలోచిస్తున్నాడు. ఇంతలో భయంకరమైన పెనుశబ్దం వినిపించి అతని ఆలోచనలకు అంతరాయం కలిగించింది. ఎదుటనేఉన్న ఒక మహావృక్షం పిడుగుపాటుకు తట్టుకోలేక ఫెళఫెళారావాలతో నేల కొరిగింది. ఆ విశాల వృక్షశాఖలను ఆశ్రయించిఉన్న నానా విధ పక్షిసమూహాలు విచిత్ర ధ్వనులను వెలువరిస్తూ గోలగా చీకటిలో శూన్యంలోకి ఎగిరి ఆశ్రయంకోసం గ్రుడ్డిగా దేవులాడుతున్నాయి. కొన్ని విహంగాలు ఆ మహావృక్షశాఖలలో చిక్కుకొని విలవిల తన్నుకుంటున్నాయి. మరికొన్ని పరిసర వృక్షశాఖల నాశ్రయించి తమ దుస్థితికి విలపిస్తున్నాయి.

ఆ హృదయ విదారక సంఘటనలతో ఆమె హృదయం చెదిరిపోయింది. ఆమె భయంతో తన ముఖాన్ని రెండుచేతులా కప్పుకొని ఏదో అస్పష్టంగా గొణిగికొన్నది.

జైమిని ఆమె దగ్గరగా వెళ్లి మెల్లగా బుజ్జగిస్తున్నట్లు ఇలా అన్నాడు: ''చూడమ్మా! నీవు అనవసరంగా కాలయాపన చేసినందువలన కష్టాలను కోరితెచ్చుకున్నట్లే అవుతుంది. మనం తొందరగా ఈ ప్రదేశాన్ని విడిచి సురక్షిత స్థలానికి చేరుకోవడం ఎంతైనా మంచిది. నీ నివాస స్థలం ఎక్కడో తెలియజేస్తే....''

ఇంతవరకూ మౌనంగాఉన్న ఆమె హఠాత్తుగా అతని మాటలకు అడ్డు వచ్చింది. ముఖాన్ని ఆచ్ఛాదించి ఉన్న హస్తద్వయాన్ని యథాస్థితికి తెచ్చి ఆమె మెల్లగా మృదు మధుర కంపిత స్వరాన ఇలా అన్నది:

''క్షమించాలి మహాత్మా! మీ నిర్మల హృదయానికి కరుణ రసమయ కార్యాచరణ ఉత్సుకతకు నా మనఃపూర్వక ధన్యవాదాలు. ఈ అభాగ్యజీవి గురించి తమరు వృథా శ్రమ తీసుకుంటున్నారు. నా నివాసస్థలం తెలిపినందువలన ఏమీ ప్రయోజనం లేదు. కారణాంతరాలవల్ల విధిప్రేరితనై నేను ఇలా రావలసి వచ్చింది. ఇక్కడే కాస్సేపు తలదాచుకొని ఈ వాతావరణ విలయతాండవం ఉపశమించిన తర్వాత నా దారిని నేను వెళ్లిపోతాను. తమరు అయాచితంగా నాయందు దయ జూపినందులకు చాల కృతజ్ఞురాలను.''

# బ్రహ్మచారి

''ఇటువంటి ప్రదేశాలలో రాత్రులందు చరించడం అంత శ్రేయస్కరం కాదు. తుఫాను శాంతించినా ఈ కాళరాత్రిలో ఎక్కడకు వెళ్లగలవు? పోనీ, కనీసం నీ గమ్యస్థానాన్ని నిర్ణయించుకొనే బయలుదేరావా?'' అన్నాడు జైమిని జాలిగా.

ఆమె దూరంగా చీకటిలోకి చూస్తూ భారంగా నిట్టూర్చి, ''లేదు. అదికూడా ఇంకా నిర్ణయించుకోలేదు'' అన్నది.

జైమిని హృదయం కలుక్కు మన్నది. అతని లోని కరుణరసం ఉవ్వెత్తుగా పొంగి ప్రవహించ సాగింది. అతని పరోపకారబుద్ధి ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉవ్విళ్లూరు తున్నది. ఆమెను ఆ భయంకర వాతావరణంలో ఒంటరిగా విడిచిపెట్టి వెళ్లిపోవడానికి అతనికి మనస్కరించలేదు. అయితే ఆమె మాటలను బట్టి ఆమె తిరిగి తన నివాసస్థలానికి వెళ్లేటట్లు కనిపించటంలేదని తెలుస్తూ ఉంది. పోతే, తను, ఆమెకు తోడుగా అక్కడే తెల్లవారే వరకూ ఉండడం కూడా అంత సమంజసంగా కనిపించడం లేదు. మరైతే ఏమిటి చెయ్యడం? ప్రస్తుత కర్తవ్యం అతనికి ఒకంతట తలచూప లేదు. చివరికి అతడొక నిర్ణయానికి వచ్చి నెమ్మదిగా ఇలా అన్నాడు.

''చూడు సోదరీ! నాదొక విన్నపం.''

ఏమిటన్నట్లు ఆమె అతనివైపు చూచింది.

''మా ఆశ్రమం ఇచ్చటకు అతి సమీపంలోనే ఉన్నది. నీకు అభ్యంతరం లేకపోతే ఈ రాత్రికి నాతోపాటు నా కుటీరంలో తలదాచుకొనిఉదయం బహుశా, ఈ తుఫాను శాంతించినట్లయితే నీవు యథేచ్ఛగా వెళ్లిపోవచ్చును'' అన్నాడు జైమిని.

ఆమె కంగారుగా ''వద్దు, స్వామీ, వద్దు. అది అంత సంతోషించవలసిన విషయంకాదు. ఇప్పటికే పరిస్థితుల ప్రభావానికి క్రుంగి కృశించి పోతున్నాను. పైగా ఇదొక అపవాదు'' అన్నది.

''అపవాదా?'' అన్నాడు జైమిని ఆశ్చర్యంగా.

''అవును. అపవాదు కాక మరేమిటి? రాత్రివేళ పరపురుషుని ఇంటిలో అతని సన్నిధిలో నాలాంటి యువతి గడపటం లోకం దృష్టిలో ఎలా ఉంటుందో ఆలోచించారా?'' అని ఆమె ఎదురు ప్రశ్న వేసింది. ''అంతకంటె, ఇక్కడే ఏ పిడుగు పాటువల్ల అయినా మరణించడమే శ్రేయస్కరం'' అన్నది నిట్టూర్పుతూ.

జైమిని హృదయం చిన్నబోయింది. ఆమె సంకుచిత భావాలకు అతడు కొద్దిగా నొచ్చుకున్నాడు.

హృదయాన్ని ప్రేమ ఆక్రమించినప్పుడు కన్నులు చూడలేవు; చెవులు వినలేవు.

''సోదరీ! నీవు తప్పుగా అపోహ పడుతున్నావు. మేము పవిత్రబ్రహ్మచారులం. మావల్ల నీకు ఎటువంటి అపకారమూ జరగడానికి ఆస్కారం లేదు. ఒక్కరాత్రి మాకుటీరంలో గడిపినందువల్ల నీకు కళంకం ఆపాదిస్తే అది నిజంగా విచారించవలసిన విషయమే'' అన్నాడు జైమిని.

''మహాత్మా, మీ పవిత్రతను నేను శంకించడం లేదు. మీ సౌమ్య ప్రవర్తనే మీ పవిత్రతకు ప్రబల నిదర్శనం. అయితే ఒక్క విషయం మాత్రం మీరు కూడా కాదనలేరు. మీవంటి పవిత్ర బ్రహ్మచారుల మధ్యకు నేను రావడం నామట్టుకు నాకు పాపహేతువే అవుతుంది. మీ నిర్మల హృదయాలలో ఏమాత్రం అగ్ని రగిలినా ఆ నేరానికి భగవంతుడు నన్ను శిక్షించక మానడు. ప్రశాంతంగా వెళ్లిపోతున్న మీ జీవిత వాతావరణంలోనికి ఈ తుఫానును ఎందుకు బుద్ధిపూర్వకంగా ఆహ్వానిస్తారు?''

''ఆ విషయమై నీవు విచారించవలసిన అవసరం ఎంతమాత్రమూ లేదు. సోదరీ! మా శక్తిపై తగిన విశ్వాసం మాకున్నది. నీవు చేయవలసినదల్లా నీ సోదరుని ఆతిథ్యం స్వీకరించి ధన్యునిగాచేయడమే'' అని జైమిని ప్రాధేయపడ్డాడు.

వర్షం కొద్దిగా తగ్గుముఖం పట్టింది. గాలి విసురుకుమాత్రం వృక్షశాఖలు విపరీతంగా ఊయల లూగుతున్నాయ్. ఆకసంలో ఎక్కడా వెలితిలేకుండా నల్లని మేఘాలు ముసురుకొని ఉన్నవి. మళ్లీ ఏ క్షణంలో అయినా అవి విరుచుకు పడడానికి సిద్ధంగా ఉన్నట్లు కన్పిస్తున్నాయి. అక్కడినుంచి కదిలిపోవడానికి అంతకంటే అనువైన సమయం మళ్లీ రాదని జైమిని ఆ యువతిని మరొకసారి హెచ్చరించాడు.

ఆమె కొద్ది క్షణాలు మెదలకుండా ఊరకున్నది. తర్వాత తలెత్తి ఒకసారి చుట్టూ కలయజూచింది. క్షణం క్రితం పిడుగుపాటుకు ఫెళఫెళ విరిగి పడిన వృక్షరాజం, ఆ చీకటిలో గోలగా చెలరేగిన పక్షుల దుస్థితి ఆమె కళ్ల ముందు మెదిలాయి. ఆమె మనసులో ఏమనుకున్నదోగాని పైకిమాత్రం అంగీకారం సూచించి ఇలా అంది:

''మహాత్మా! మీరు మరీ బలవంతం పెడుతున్నారు గనుక నా నిర్ణయాన్ని మార్చుకోవలసి వచ్చింది. పూజ్యులైన మీ ఆతిథ్యాన్ని తిరస్కరించడానికి సాధ్యం కావడం లేదు. ఆఖరికి మీ కారుణ్యమే జయించింది. ఈ అభాగ్యురాలు మీ ఆశ్రయాన్ని ఒక్క రాత్రికి మాత్రమే అంగీకరించగలదు.''

జైమిని హృదయం ఆనందంతో గంతులు వేసింది. అతని ఆత్మ నిర్మల సంతృప్తి సహితమై సంతోషడోలికలో ఊయల లూగింది. ఎందుకు? ఆ అపురూప సౌందర్యవతికి తను ఆశ్రయమిస్తున్నానని కాదు. ఒక అభాగ్యజీవికి ఆశ్రయమిచ్చి ఆదరించ గలిగాను కదా అని మాత్రమే.

(సశేషం)

# బ్రహ్మచారి

శాంతిప్రియ

**జరిగినకథ**

*బ్రహ్మచర్య నిర్వాహణానికి, స్త్రీ సాన్నిహిత్యానికి పొత్తు కుదరదని వ్యాసమహర్షి హెచ్చరించారు. ఇంద్రియ నిగ్రహి ఏపరిస్థితులలోనూ లొంగిపోడని జైమిని వాదించాడు. వ్యాసభగవానులు ఎక్కడికో వెళ్ళారు. జైమిని ధ్యాన ముద్రకు తుఫాను విఘాతం కలిగించినది. ఆశ్రమానికి తిరిగిపోతూ దారిలో అగతికురాలై ఉన్న యువతికి ఆశ్రయం ఇవ్వడానికి నిశ్చయించాడు. ఆమె అంగీకారం పొందాడు.*

---

(క్రిందటి సంచిక తరువాయి)

ఇద్దరూ తొందరగా ఆశ్రమం చేరుకున్నారు. ఆశ్రమ వాటికలోని పర్ణశాలలన్నీ తలుపులు మూసుకొని విశ్రాంతి తీసుకుంటున్నాయి. తుఫాను బీభత్సానికి భయపడి ఎవరూ తలుపులు తెరిచి ఉంచలేదు.

జైమిని తన పర్ణశాలను సమీపించాడు. ఆ యువతికూడా నీడలా అతనివెంటనే అనుసరించింది.

వర్షం తరుముకొనివచ్చినట్లు ఒక్కసారిగా మళ్లీ విరుచుకుపడింది. క్షణంకూడ బయట ఉండటం వారికి అసాధ్యమైపోయింది. జైమిని తలుపుతెరిచి లోన ప్రవేశించాడు. ఆమె మాత్రం సంశయిస్తూ ద్వారం వద్దనే నిల్చుని ఉండిపోయింది.

పర్ణశాల లోపలిభాగం చీకటి కూపంలా ఉంది. జైమిని నెమ్మదిగా తడుముకొంటూ వెళ్లి దీపం వెలిగించాడు. అంధకారం అపజయాన్ని అంగీకరించి పిక్కబలం చూపించిందేమో అనేటట్లు గది నలుమూలలా వెలుతురు ఆక్రమించుకుంది.

ఆమె లోపల అడుగు పెట్టడానికి సంశయిస్తున్నట్లు గమనించి జైమిని ఆమె దరిచేరి "భయం లేదు. లోపలకు రా అమ్మా" అన్నాడు.

ఆమె కొంతసేపు తటపటాయించి తర్వాత నెమ్మదిగా లోపల ప్రవేశించింది. ఆమెతోపాటు ఒకపెద్ద గాలితెరవచ్చి దీపాన్ని రెపరెపలాడించింది. దీపం ఆరిపోకుండా జైమిని వెంటనే తలుపుజేరవేసి లోపల గడియపెట్టాడు.

వేటగానివలలో చిక్కిన హరిణిలా ఆమె మొదట్లో చాల కంగారు పడుతున్నట్లు కనిపించింది. కాని కొంతసేపటికి తను కంగారు పడవలసిన అవసరం లేనట్లు గ్రహించి స్థిమితపడింది.

జైమిని ఆమె వైపు చూశాడు. ఆమె ధరించిన దుకూలం బాగా తడిసి ముద్దయిపోయింది. చలికి కాబోలు ఆమె శరీరం రావి ఆకులా గడగడ వణకుతున్నది. ఆ వస్త్రంతో అమె మరెంతోసేపు ఉండలేదని తెలుస్తూనే ఉంది. అందువలన దండెనున్న కాషాయ వస్త్రాలలో ఒకటి తను తీసుకొని వేరొకటి ఆమె కిచ్చాడు.

ఆమె నిరభ్యంతరంగా వస్త్రం అందుకొన్నది. కాని కట్టుకోడానికి ఉపక్రమించక సందేహిస్తూ అతనివైపు చూస్తూ ఉండి పోయింది.

ఆ చూపులోని అంతరార్థాన్ని అతడు ఇట్టే గ్రహించుకున్నాడు. తన సమక్షంలో చీరె మార్చుకోవడానికి ఆమె సందేహిస్తున్నట్లు భావించి అతడు కాస్సేపు బయట వెళ్లి ఉండడానికి నిశ్చయించుకొన్నాడు. కాని ఈ కొద్ది వ్యవధిలోనే బయట గాలిఒత్తిడి విపరీతంగా విజృం



ళించి ఉన్నందువలన తలుపుతెరవడం శ్రేయస్కరంగా కనిపించలేదు. ఏమాత్రం సందు దొరికినా గాలి హోరుమని ప్రవేశించి పర్ణశాలను మళ్లీ చీకటికూపంలా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లుంది.

అందువలన అతనికి ఏమీ చెయ్యడానికీ పాలుపోలేదు. పరిస్థితిని అర్థం చేసుకొన్న ఆమె తలుపు తీయవద్దని అతని హెచ్చరించి పర్ణశాలలో ఒక మూలకుచేరి వస్త్రం మార్చుకునే కార్యంలో నిమగ్న అయింది.

అతను వెనుదిరిగి తలుపుదగ్గర నిల్చొని ఉన్నాడు. అతనికి కొంతదూరంలో ఆమె చీరె మార్చుకొంటున్నది. తడిచీరె విప్పి కుప్పగా పక్కనే పెట్టింది. జైమిని ఇచ్చిన కాషాయ వస్త్రం అంచులు పట్టుకొని కట్టుకోవడానికి మొలకు ఒక కొన చుట్టబోయింది. కాని గడగడ వణుకుతున్న ఆమె చేతులనుండి ఆ కాషాయ వస్త్రం అప్రయత్నంగా జారిపడింది. వెంటనే 'అయ్యో' అన్న మాటలు చిన్నగా ఆమె నోటి నుండి వెలువడ్డాయి.

జైమిని ఏం జరిగిందో అన్న ఆతృతతో హఠాత్తుగా వెనుదిరిగి ఆమె వైపు చూశాడు. సంపూర్తిగా వివస్త్రయై ఉన్న ఆమె నగ్న శరీరం అతని కంటపడింది. రెప్పపాటుకాలంలో అతడు ఆమె సర్వాంగాలను చూడకూడదనుకుంటూనే చూసివేశాడు. మరుక్షణంలో అతడు చరాలున ముఖం ప్రక్కకు త్రిప్పుకొని ఉద్విగ్న మానసంతో కన్నులు మూసుకొన్నాడు. ఈ అదను కనిపెట్టి మదనుడు ఒక పూలచెండును వింట సంధించి అతని హృదయఫలకం మీద గురిచూచి కొట్టాడు. అది సరాసరి తగలవలసిన చోటనే తగిలింది. కాని దానివల్ల అప్పట్లో అంతప్రయోజనం కలుగ లేదు.

తన నగ్న శరీరం అతని కంటబడిందని తెలియగానే ఆమె సర్వాంగాలూ సిగ్గుతో ముకుళించుకున్నాయి. ఆమె చెక్కిళ్ళు లజ్జాభావంతో మరింత ఎరుపెక్కాయి. ఆమె వెంటనే తత్తరపాటుతో జారిపడిన కాషాయవస్త్రాన్ని తీసుకొని దానితో తన శరీరాన్ని మరుగు పరచుకొన్నది.

తర్వాత జైమిని ఆమె వైపుతిరిగి "క్షమించు సోదరీ ! ఈ విషయంలో నేను అపరాధిని" అని అతి మందస్వరాన అన్నాడు.

ఆమె అధోవదనంతో నేలను చూస్తూ, "లేదు, లేదు. పొరపాటు నావల్లనే జరిగింది. అయినా జరిగిపోయినదానిని గురించి విచారించడమెందుకు ? ఎవరూ బుద్ధి పూర్వకంగా అపరాధం చేయలేదు కదా" అన్నది.

జైమిని మరేమీ మాట్లాడలేదు. ఒక పాపభూయిష్ఠమైన దృశ్యాన్ని చూచినందుకు అతని మనస్సు కొద్దిగా దిగజారిపోయింది. అయినా తను ఆ దృశ్యాన్ని బుద్ధి పూర్వకంగా చూడలేదు కూడా అని సరిపెట్టుకొని కొంచెం సంతృప్తి చెందాడు.

అప్పటికి చాలా రాత్రి గడిచిపోయింది.



తులసి పూజ    చిత్రం—ఎమ్. శంకర్రావు (అనకాపల్లి)

పర్ణశాలలో ఉన్న కొద్దిపాటి ఫలాలతో వారిద్దరూ ఆకలితీర్చుకున్నారు. బాగా అలిసి ఉన్నందు వలన కండ్లనిండా నిద్రముంచుకు వస్తున్నది. కనురెప్పలు అతిభారంగా వాలిపోతున్నాయి. ఇద్దరకూ విధిగా విశ్రాంతి తీసుకోవలసిన అవసరం ఏర్పడింది.

చెరొక కాషాయ వస్త్రం నేలపై సరుచుకొని దూరదూరంగా శయనించారు. వారి విభిన్న మనస్తత్వాలకు సాక్షిగా దీపం దేదీప్యమానంగా వెలిగిపోతున్నది. అప్పుడప్పుడు తలుపుసందునుండి సన్నని గాలి తెరలు చొరుళ్లగా లోపల ప్రవేశించి దీపాన్ని రెపరెపలాడిస్తున్నాయి. తాళపత్రనిర్మితమైన ఆపర్ణశాల పైకప్పును వర్షధారలు డబడబ బాదుతున్నాయి. ఎటువిన్నా హోరుమన్న శబ్దం తప్ప వేరేమీ విన్పించడం లేదు.

*  *  *  *

ప్రళయగర్జనలతో అర్ధరాత్రి దాటిపోయింది. అప్పటికి తుఫాను కొద్దిగా శాంతించింది. అయినా ఇంకా సన్నని నీటి తుంపరలు పర్ణశాలపై టపటపమని పడుతూ చిన్నగా లయ వేస్తూనే ఉన్నాయి.

ఆ సమయంలో జైమిని నిర్వికారుడై నిశ్చల చిత్తంతో నిద్రపోతున్నాడు. అతనికి కొద్దిపాటి దూరంలో ఆమె కూడా నిశ్చింతగా నిద్రపోతున్నది. జ్యోతి యథారీతి వెలుగుతూంది. కాలగతి మందంగా సాగిపోతున్నది.

ఇలా మరికొంత సమయం గడిచిపోయింది.

•  •  •

నాటక సూత్రధారి తన నాటకాన్ని రసమయంగా పరిసమాప్తి చేయాలని సంకల్పించుకొని ఒక క్రొత్త సన్నివేశాన్ని సృష్టించడానికి సన్నాహాలు చేస్తున్నాడు. ఆ నాటక ప్రదర్శనలో అదే అంత్య సన్నివేశం. దాన్ని జయప్రదం చేయడంలోనే తన కౌశలం అంతా ఇమిడి ఉన్నది.

గాఢనిద్రలో మునిగి వైమరచి నిద్రిస్తున్న జైమినికి ఒక చిత్రమైన స్వప్నం వచ్చి నిద్రాభంగ మొనరించింది. తన పర్ణశాలలో ఒక భీకరాకారుడు ప్రవేశించి ఆ యువతిని బలాత్కరిస్తున్నట్లున్నూ, ఆతని పట్టునుండి విడిపించుకోవడానికి ఆమె చేపలా గిలగిలలాడుతూ పెనగులాడుతున్నట్లున్నూ అతనికి ఆ కలలో కన్పించింది.

అతడు తృళ్లిపడి లేచి చూశాడు. ఎట్ట ఎదుట ఏ భీకరాకారుడూ కనిపించకపోయేసరికి అతనికి అదంతా స్వప్నమేనని తెలుసుకోడానికి ఎంతోసేపు పట్టలేదు. తుఫాను బాగా శాంతించినందువలన ఎక్కడా ఏమాత్రం అలజడి కూడా లేక అతి ప్రశాంతంగా ఉన్నది.

అతని కన్నులు అప్రయత్నంగా ఆమె వైపు

లిరిగాయి. ఇంత క్రితం ఏ పాపభూయిష్ఠమైన దృశ్యం చూడ్డం వలన అతని హృదయం సంక్షుభితమై కలతచెంది ఎలపెలలాడిందో మళ్ళీ దాదాపు అటువంటి దృశ్యమే అతని కంట పడటంతో అతని మనస్సు మరింత వికలమై పోయింది. ఆమె పైటచెంగుగా వేసుకొన్న కాషాయివస్త్రం నిద్రమత్తులో స్థానం తప్పి పక్కకు ఒరిగిపోయి ఉన్నది. సహజయౌవన లావణ్య రసమయమైన ఆమె వక్షస్థలం సిగ్గువిడిచి బహిర్గతమై ఆ బ్రహ్మచారిని చూచి విరగబడి నవ్వుతున్నట్లు అనిపిస్తున్నది. 'ఓయీ మూర్ఖుడా ! అరచేతి యందున్న స్వర్గసుఖాలను ఈసడించి ఎక్కడో పరలోకం లోని సౌఖ్యాలకోసం అర్రులు చాచుకొని వెర్రి వానిలా ఎందుకు ఎదురుచూస్తావు? నా స్పర్శ మాత్రాన ఎటువంటి అలౌకిక ఆనందం కలుగుతుందో ఒక్కసారి చవిచూడు. అజ్ఞాత సుఖాలను ఆశించే కంటే ప్రత్యక్ష రసానుభూతులను మరింత రసవత్తరము చేసుకొని ఎందుకు ఆనందించవు? ఉన్నది వదలుకొని

# బ్రహ్మచారి

లేనిదానికై ఎగబడి రెంటికి చెడిన రేవడిలా ఎందుకు పరితపించడం?' అని ఆమె అర్ధనగ్న శరీరం అతన్ని ఉద్రిక్తపరచడానికి ప్రయత్నిస్తున్నది. నిద్రలో కూడ ఆమె అనింద్య సుప్రసన్న వదనం చిరునవ్వులను వెదజల్లుతూ ఆమె సోయగాన్ని ద్విగుణీకృతంచేస్తున్నది.

ఆమెవైపు జైమిని అలా మరెంతోసేపు చూడలేకపోయాడు. పాపభయాందోళన సమ్మిళితమైన భావనలతో ఉద్విగ్నమైన అతని మనస్సు జలబిందువులా సంకుచితమై తన దౌర్బల్యాన్ని సహస్రవిధాల దూషించుకొన్నది. అతడు కన్నులు గట్టిగా మూసుకొని ఆ దృశ్యాన్ని మరచిపోవడానికి ప్రయత్నిస్తున్నాడు. కాని అది అతని శక్తికి అతీతమైపోయింది. కన్నులు మూసుకొన్నంత మాత్రాన బాహ్య దృశ్యాన్ని చూడకుండా ఉండగలిగాడు కాని మనఃఫలకం మీద గాఢముద్రవేసుకొనిపోయిన అంతర్దృశ్యాన్ని చెరిపివేయడం అతనికి సాధ్యం కావడం లేదు.

అతడు మళ్ళీ నిశ్చింతగా నిద్రించడానికి ప్రయత్నించాడు. కాని అతని ప్రయత్నం కొన సాగలేదు. కన్నులు మూసినప్పుడల్లా ఆమె నగ్న శరీర లావణ్యం అతని కళ్లముందు నాట్యం చేస్తున్నట్లే అనిపించి, అతన్ని మరింత ఉక్కిరి బిక్కిరి చేసివేస్తున్నది. అందువలన అతడు నిద్రించాలనే సంకల్పాన్ని విడిచిపెట్టి లేచి కూర్చున్నాడు. కలుషపూరితమైన మనస్సును భగవద్ధ్యానమనే పవిత్రజలంతో కడిగి నిర్మలం చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. నేలపై పద్మాసనం వేసుకొని కూర్చొని మనస్సును భగవంతునిలో లీనం చేసుకోడానికి సాధన చేస్తున్నాడు.

కాని ఎన్నిచేసినా ఫలితం కనిపించడం లేదు. మళ్ళీ అదే దృశ్యం ! అతనికి ఏమి చేయడానికీ పాలుపోవడం లేదు.

"ఓయ్! భగవంతుడా ! ఏమిటీ పరీక్ష ? నే నేం అపరాధం చేశాను? నన్నెందు కిలా క్షోభ పెట్టుతున్నావు?" అని పరిపరి విధాల అతను తన నిస్సహాయస్థితికి విలపిస్తున్నాడు.

అతనికి హఠాత్తుగా ఆనాటి గురుదేవుల ప్రసంగం జ్ఞాపకానికి వచ్చింది. "సాధ్యమైనంతవరకూ స్త్రీ సాన్నిధ్యం నుండి తప్పించుకొని యువతులకు దూరంగా ఉండడమే అన్ని విధాం శ్రేయస్కరం" అని వ్యాసభగవానులు అన్నమాటలు అతనికి గుర్తుకు వచ్చాయి. అందులో నిగూఢమై ఉన్న అంతరార్థం ఇప్పుడిప్పుడే అతనికి అనుభవంలోకి వస్తున్నది.


దారినిపోయే కార్చిచ్చును స్వయంగా తీసుకొని వచ్చి నందనవనంలో విడిచిపెట్టాడు. కార్చిచ్చు స్వభావం ఎక్కడికిపోతుంది? అది తన సహజకాంతి సముజ్జ్వలములైన శత సహస్రజిహ్వలను చాచుకొని విజృంభిస్తున్నదంటే అందులో ఆశ్చర్యపడవలసినదేమీ లేదు. దానినైజమే అంత.

జైమిని హృదయం కల్లోలిత సముద్ర తరంగాలవలె కకావికలై విపరీత దుర్భర యాతనామయపూరితమైపోయినది. అయితే తన హృదయం ఎందుకలా ఎదురు తిరుగుతున్నదో అతనికి అర్థం కావడం లేదు. తన నిగ్రహశక్తి మనోబలం ఇత్యాదులు ఆ సమయంలో ఏమైపోయాయో అతనికి అంతు చిక్కలేదు. గురుదేవుల సమక్షంలో తను పల్కిన పలుకులు వట్టి నీటిమీద వ్రాతలేనా? అవి ఆచరణలో పెట్టే సామర్థ్యం తనలో లేదా? నశ్వరమై క్షణభంగురమైన ఒక యువతి నగ్నశరీర దృశ్యానికే తన మనస్సు ఇలా దిగజారిపోతే మున్ముందు తను మోక్షద్వారాన్ని తట్టడమంటూ ఎలా సాధ్యమవుతుంది?

అయినా తనెందుకు ఇంతగా విలపిస్తున్నాడు?

మీకిష్టమైన నూనెలో నానబెట్టుడు
కాశ్మీర్-కుసుం
కేశములను పెరిగించును. అకాలనెరను మాన్పును.
చరుమ ఉపద్రవములకు
సౌంటలక్స్ ములాము
చేతుమ అపాయములకు
"క్రోడి" మార్కు శ్రేష్ఠమైన ఉదువత్తులు, సువాసనలు & ఫ్లవర్‌డస్ట్ పేట్టెలకు
నంజనగూడు పండ్లపొడి & అపూర్వ ఔషధములు
సోల్ ఏజంట్లు: యునైటెడ్ కంసర్న్, మదరాసు, హైదరాబాద్, విజయవాడ
నన్‌జన్‌గూడు ఔషధములకు ఒక టవునుకు ఒక స్టాకిస్టును ఆహ్వానించెదము


పూవు మీ అదృష్టం చెప్పగలదు
నీ భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.
జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, అకస్మాత్తు ద్రవ్య లాభము మొదలగు వానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.
Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AW-13) Jullundur City.



## భిన్నత్వంలో ఏకత్వం

ఫోటో—కుమారి పుసులూరి సుబ్బలక్ష్మి (తణుకు)

తన మనస్సును నిజంగా ఆ దృశ్యం చలింపజేసిందా? లేక తనంతతానే అలా భ్రమించి బాధ పడుతున్నాడా? ఇంతకూ ఆ దృశ్యంలో ఉన్న ఘనతఏమిటి? వనితాకారంలో మలిచిన ఒక మాంసగోళం! స్త్రీ రూపంలో ఉన్న ఒక అస్థికల సమూహం! అంతే. అంతకంటే వేరేమీకాదు. అంతమాత్రానికే తనేదో మహాపరాధం చేసినట్లు ఎందుకు భావించుకోవాలి? దురదృష్టవశాత్తూ ఆ దృశ్యం తన కంట పడిందే కాని అందులో తనదోషం ఈషణ్మాత్రం కూడ లేదు. మరైతే తనకెందుకీ వృధా వ్యధ? నిశ్చింతగా తనెందుకు ఆ విషయాన్ని గురించి మరచి నిద్రపోలేకపోతున్నాడు?

ఇవే ఆలోచనలు అతని మనస్సులో ఈగల్లాగ ముసురుకొంటున్నాయి. వాటిని పారద్రోలడానికి అతను చేసిన ప్రయత్నాలన్నీ ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి.

మళ్లీ మళ్లీ అదే సంఘటన, అవే ఆలోచనలు **అతని** మానసంలో విపరీత సంచలనం లేవదీస్తున్నాయి.

**అతడు** పూర్తిగా అధీరుడై పోయాడు. అతని అకుంఠిత దీక్ష ఏకాగ్రత అన్నీ మంట గలసిపోతున్నాయి. మరికొంత సేపట్లో తెల్లవారిపోతుంది. ఈ కొద్దిపాటి సమయాన్ని ఎలాగో గడిపివేస్తే తెల్లవారగానే ఆమెను సాగ నంపవచ్చు. అంతవరకూ తను జాగ్రత్తగా మెలగడం ఎంతైనా అవసరం. ఆ తర్వాత తన నిత్యజీవితానికి ఎటువంటి అవరోధమూ ఉండదు.

ఈ విధంగా అతని ఆలోచనలు వివిధ కోణాలలో పరుగులెత్తుతున్నాయి. వాటిని అదుపులో పెట్టడానికి **అతడు** చేసిన ప్రయత్నాలన్నీ పూర్తిగా నిష్ప్రయోజనం కావడంతో అతడు వాటి పగ్గాలు విడిచిపెట్టేశాడు.

అయితే ఈ లోగా అతనికి మరొక దిగులు పట్టుకుంది. తీరా తెల్లవారిన తర్వాత ఈమెను తన సహవాసులు చూచి ఏమనుకుంటారో? ఈమెతో తను ఆరాత్రి గడిపినందుకు వారందరూ ఏమని భావిస్తారో? అయితే ఏమిటి చెయ్యడం? తెల్లవారకముందే ఈమెను పంపివేస్తే? ఉహు! అలా చెయ్యడానికి తన ఆత్మ అంగీకరించదు. అది అంత సముచితం కాదు కూడా. నైతికంగా తను పతనం చెందనంత వరకూ ఎవరు ఏమనుకున్నా తనకు లక్ష్యంలేదు.

ఇలా పరిపరివిధాలుగా ఆలోచించుకుంటూనే అతడు మళ్లీ నెమ్మదిగా గాఢనిద్రకు లోనయ్యాడు.

ఆ నిద్రలో ఒక రసవత్తరమైన స్వప్నం!... మిట్టమధ్యాహ్నం మండుటెండలో తను ఎక్కడనుండో వస్తున్నాడు. ఆదారి అతనికి క్రొత్తగా కనిపించింది. తను దారితప్పిపోలేదు కదా అని అనుమానంతో జైమిని నలువైపులా పరికించాడు. నిజమే! తను దారితప్పాడు. ఈ పరిసరాలు తనకు బొత్తిగా క్రొత్తవిగా అపరిచితాలుగా కన్పిస్తున్నాయి. అయితే తను ప్రస్తుతం ఎక్కడినుంచి వస్తున్నాడో ఎక్కడకు వెళ్లుతున్నాడో దారి ఎలా తప్పాడో అతనికి అర్థం కాలేదు. ఏమిటో అంతా చిత్రంగా అయోమయంగా ఉన్నట్లుంది!

ఎండ తీవ్రతకు పైన నెత్తి, క్రింద పాదాలు చుర్రుమంటున్నాయి. దాహంతో నాలుక పిడచ కట్టుకుపోయింది. ఎక్కడా నీటిజాడ కనిపించడం లేదు. ఇలా మరికొంత సేపు గడిస్తే ఉన్నప్రాణం కాస్తా 'హరీ' మనక తప్పదు.

అలా మరికొంత దూరం వెళ్ళేసరికి జైమినికి ఒక సుందర పర్ణశాల కనిపించింది. దాని చుట్టూ నందనవనం లాంటి మనోహరమైన ఉద్యానవనం, ప్రక్కనే ఒక చక్కని కోనేరు ఉన్నాయి. ఆ జలాశయాన్ని చూడగానే జైమిని ప్రాణం లేచివచ్చినట్లయింది. గబగబావెళ్లి దోసిలితో నీళ్ళుపట్టి త్రాగబోయాడు.

ఎండకు జలాశయంలోని నీళ్లు వెచ్చగా ఉన్నందువల్ల ఆనీరు త్రాగడం అతనికి సాధ్యం కాలేదు. ఎలాగో రెండు గుక్కలు త్రాగి అతడు ఉస్సురని అక్కడినుంచి లేచాడు. అతని దాహం ఏమాత్రం కూడా తీరలేదు. కడుపునిండా చల్లనినీరు గ్రోలనిదే అతడు ముందుకు ఒక్క అడుగు కూడా వెయ్యలేని పరిస్థితిలో ఉన్నాడు.

అతని దృష్టి పర్ణశాలపై పడింది. అక్కడ ఏ మునీశ్వరుడైనా ఉండ వచ్చునని, బహుశా అతనివల్ల తన దాహశాంతి జరుగవచ్చునని అతడు ఆశించి పర్ణశాలవైపు దారితీశాడు.

పర్ణశాల అతి చిన్నదిగానే చాల ముచ్చటగా ఉంది. తలుపులు బార్లాతీసి ఉన్నాయి గాని మనుష్య సంచారం ఉన్న అలికిడి ఏమీ వినిపించడంలేదు. ఒకటి రెండు లేళ్లు అతన్నిచూచి బెదరి చెంగు చెంగున దాటులేసుకొంటూ పారిపోయాయి. అల్లంతదూరాన రెండు రాజహంసలు చెట్టునీడను చేరి చెంచువులతో తమ రెక్కలను దువ్వుకొంటున్నాయి. పక్కనే ఏదోచెట్టుమీద గువ్వలు గుసగుసలాడుకుంటున్నట్లు అస్పష్టంగా వినిపిస్తున్నది.

అతడు పర్ణశాలను సమీపించాడు. అదే సమయంలో ఒక యువతి పర్ణశాలనుండి బయటకు రాబోతూ హఠాత్తుగా అతనిని చూచి ఆగిపోయింది.

జైమిని కూడా ఆమెను చూశాడు. అయితే ఆమెను ఇంతకుముందు ఎప్పుడో చూచినట్లు లీలగా అనిపించింది. కాని సమయానికి అది గుర్తుకురాక కొంచెం తటపటాయించాడు.

ఆమె మాత్రం అతన్ని వెంటనే గుర్తుపట్టింది. "లోపలకు దయచేసి ఈ అభాగ్యురాలి ఆతిథ్యం స్వీకరించండి స్వామీ! ఎందుకలా సంశయిస్తున్నారు? నన్నుమరిచిపోయారా?"

అని ఆమె అంటున్నది. వినిపించుకోకుండా అతడు తను మరచిపోయిన ఏదో విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ అలానే ఉండిపోయాడు.

హఠాత్తుగా అతనికి అంతా జ్ఞాపకానికి వచ్చింది. ఆనాడు తుఫానులో చిక్కుకొని తనకోర్కెపై పర్ణశాలలో ప్రవేశించి తన హృదయంలో తుఫాను లేవదీసిన యువతి ఈమే నని అతనికి గుర్తుకొచ్చింది. అయితే తన కుటీరం నుండి ఈమె ఎప్పుడు వెళ్లిపోయిందో, ఈ ప్రదేశంలో నివాసం ఎప్పుడు ఏర్పరచుకుందో, అసలు తను ప్రస్తుతం ఈ ప్రాంతానికి ఎందుకు రావలసి వచ్చిందో అతనికి అర్థం కాక వెర్రిచూపులు చూస్తూ ఉండిపోయాడు.

అతని పరిస్థితి పసిగట్టి ఆమె సన్నగా నవ్వి, "తమరు ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లున్నారు. మీవంటి మహాత్ములను సత్కరించదగిన యోగ్యత నాకున్నదో లేదోనని విచారణ చేయడం లేదు కదా?" అన్నది.

అతడు కొంచెం తేరుకొని "మాకు అటువంటి సంకుచిత భావాలు కలుగకుండు గాక!" అన్నాడు శాంతంగా.

ఆమె మరేమీ అనకుండా లోనికిపోయి ఒక కలశంతో చన్నీళ్లు తీసుకొనివచ్చి అతని *పాదాలు కడిగేందుకు పూనుకొన్నది. అయితే* ఈ కృత్యాన్ని అతడు వారించబోయాడు.

## బ్రహ్మచారి

కారణం స్త్రీ స్పర్శ తనకు తగులు తుందన్న భయం వల్ల కావచ్చు. లేక మరేదైనా అయి ఉండవచ్చు. కాని అతడు అభ్యంతరం చూపక ముందే ఆమె అతని పాదాలను తామరతూండ్ల వంటి సన్నని మృదువైన తన చేతివ్రేళ్లతో స్పృశించి కలశంలోని నీళ్ళు పాదాలపై గుమ్మరించి పాదప్రక్షాళనం పూర్తిచేసింది.

తర్వాత జైమిని ఆమె సమర్పించిన ఫల క్షీరాదులను మారు మాటాడకుండా ఆరగించి క్షుత్పిపాస లుపశమింపగా సంతృప్త మానసుడైనాడు.

ఆ సమయంలో అతడు ఏ విషయం గురించీ ఆలోచించే పరిస్థితిలో లేడు. శరీరం బాగా అలిసి ఉన్నందువలన అతడికి కొంచెం విశ్రాంతి అవసరమనిపించింది. అందుకని ఆ పర్ణశాలలో బాగా గాలివీచే స్థలంలో కాషాయ వస్త్రం పరచుకొని నడుం వాల్చాడు.

కొంత సమయం గడిచింది. జైమినికి తన పాదాలపై ఏదో మృదువుగా కదులు తున్నట్లు అనిపించి కన్నులు విప్పిచూశాడు. ఆమె అతని కాళ్లవైపున కూర్చుని మెల్లగా *తన హస్తద్వయంతో అతని పాదాలను ఒత్తు*తున్నది. కోమలమైన ఆమె హస్తస్పర్శ మృదువుగా ఉండి హాయిగొల్పుతున్నా జైమిని అది సహించలేక పోయాడు.

అతడు చరాలున లేచి ఆమె రెండుచేతులూ పట్టుకొని, "ఊహూ! ఇది మంచిపనికాదు. మేము భోగులము కాము. సన్యాసులు ఇటువంటి సపర్యల కతీతులు" అంటూ ఆమె చేతులను త్రోసివేయబోయాడు. కాని కలువలవలె మున్నితమై మనోహరంగా ఉన్న ఆమె చేతులలోని మార్దవాన్ని అతడు స్పర్శమాత్రాన గ్రహించి వాటిపై అంత కర్కశమైన చర్య తీసుకోలేకపోయాడు.

అప్రయత్నంగా అతనిదృష్టి ఆమె వదనంపై *ప్రసరించింది. ఆమె కూడా అతని ముఖంలోకి* ఒక క్షణం సేపు చూచి సిగ్గుతో మళ్లీ తల వంచుకున్నది. ఆ ఒక్క క్షణంలోనే అనుచ్చరిత ప్రణయ వాక్య సుధారస కలితములైన ఆమె కన్నులు అప్రతిమాన గూడార్థభావ ప్రబోధకములై అతనిలో ఏదో నవీన సంచలనం కలిగించాయి. స్త్రీ స్పర్శ ఎరుగని అతనిచేతులు ఆమె హస్తములలోని చల్లదనాన్ని చల్లగా దొంగిలించి హృదయకోశానికి చేరవేశాయి. ఆ ప్రథమానుభూతిలో నిగూఢమై ఉన్న ఏదో మహత్తర శక్తికి అతని సర్వాంగాలూ ఒక్కసారిగా కంపించిపోయాయి. అతని హృదయం మరీ వేగంగా కంపానుకంపితం కాజొచ్చింది. తన ప్రమేయం లేకుండానే శరీరంలోని రక్తం వేడెక్కి కళపెళలాడుతూ రక్తనాళలలో గంగవెర్రులెత్తినట్లు పరుగులెత్తుతున్నది.

అదే సమయంలో అతని హృదయాంతరాళంలో సుగంధపరిపూర్ణమైన ఒక ప్రచండ మారుతం వీవసాగింది. ఆ సుగంధవాయు సమ్మోహనశక్తికి అతని హృదయం రసమయమై ఏదో దురూహ్యమైన అజ్ఞాత శక్తికి లొంగిపోవ నారంభించింది. అతని శరీరం అతనికి తెలియకుండానే పరవశం కాజొచ్చింది.

పంచశరుడు తన పూవిలునుండి శరపరంపరలను జైమిని హృదయంపై అతి కౌశలంగా ప్రయోగిస్తున్నాడు. మన్మథుని ప్రయత్నం వృథా కాలేదు. ఈ సారి అతని శ్రమ ఫలించింది.

శృంగార రసాన్ని ఒలకబోసుకుంటూ ఆమె అతని హృదయంపై వాలిపోయింది.

అతడు అప్రయత్నంగా అనాలోచితంగా ఆమెను తనమీదికి లాక్కున్నాడు. కొండ చిలువలా అతని దేహం ఆమె శరీరాన్ని పెనవేసుకొంటున్నది.

అతని మనస్సు రెక్కలు విప్పి అతిలోక సుందరమైన ఏదో మనోహర సీమలో విచ్చలవిడిగా ఎగిరిపోతూ ఆనందాతిశయాన్ని ఆస్వాదిస్తున్నది. కోర్కెలు నాల్కలుచాచి ఆవురావురుమని రసాన్ని జుర్రుకుంటున్నాయి.

....స్వాప్నికంగా ప్రణయ సామ్రాజ్యాభిషిక్తుడై కామవికార వశుడై తత్ప్రసాదిత





## మీ అందానికి మంచిదారి



మీ జీవిత విజయాలకు అందం అవసరం. ఎండవేడికి యింకా యితరకారణాలవల్ల ముఖం క్రమేపి నల్లబడి, ముదిరూపువస్తుంది. గ్లోరియా అనే ద్రవముయొక్క అద్భుతసౌందర్య పోషకశక్తి మీ ముఖంలోని అసహ్యమయిన ముదిరూపును పోగొట్టి ఆకర్షణీయమయిన లేతదనాన్ని తెస్తుంది. మీ అందం దిన్నాదినాభివృద్ధి అవడానికి నెలకు అధమం కొన్నిసార్లు అయినా గ్లోరియా అనే సౌందర్యపోషక ద్రవాన్ని వాడండి. ముఖంమీద మొటిమలను వాటి మచ్చలను, ముడతలను, నమ్మకంగా పోగొట్టి ముఖాన్ని తెలుపుచేసి, కాంతిని, అందాన్ని తెచ్చును. మొదటి పూతకే మీకు ఆశ్చర్యాన్ని కలిగించే అందాన్ని యిస్తుంది. ఒకసారి వాడి చూస్తే మీరెప్పుడూ విడువరు. అన్నిషాపులలో దొరకును.

జనితా ప్రొడక్ట్సు - ఏలూరు. (ఆంధ్ర)



**విశాఖపట్టణం లైట్ హౌస్**

ఫోటో—అవసరాల నారాయణరావ్ (విశాఖపట్టణం-2)

మహానందమయ మానస్కుడైన జైమినికి హఠాత్తుగా నిద్రాభంగమైంది. ఎవరో ఝుళ్లన కొరడాతో వీపుపై కొట్టినట్లయి అతడు త్రుళ్లిపడి లేచాడు. స్వప్న దృశ్యం పొగ మంచులా విడిపోయింది. అయినా ఆ స్వాప్నిక మధురలాలసానుభూతినుండి అతడు ఇంకా విముక్తుడు కాలేదు.

అతని హృదయం భరించరానంత మహావేగంతో స్పందిస్తున్నది. శరీరం గాలిలో దీపంలా అల్లాడిపోతున్నది. రక్తం సలసల కాగినట్లు సెగలతో శరీరమంతటా పరుగులు తీస్తున్నది.

జైమిని తన శరీరంలో జరిగిన ఈ దుష్పరిణామానికి ఆందోళనతో పరితపిస్తున్నాడు. ఐనా తన మనస్సును పూర్వంలా నిగ్రహించుకొని స్థిమితపడలేకపోతున్నాడు. అందుకు కారణం అతనికి బాగా తెలుసు. తన మనస్సు ఇదివరకే హద్దుమీరి విచ్చలవిడిగా కళ్లెంలేని గుర్రంలాగా పరుగులెత్తి విషయలాలసత్వానికి దాసోహమన్నది. స్వాప్నికంగానే కావచ్చు—ఒకసారి నైతికపతనం చెందిన మనస్సును తిరిగి ఉద్ధరించడానికి అతనికి ఆ క్షణంలోనే సాధ్యం కాలేదంటే ఆశ్చర్యపడవలసిన అవసరం ఏమీ లేదు.

అతని జ్ఞాన చక్షువులు మూసుకుని విశ్రాంతి తీసుకుంటున్నాయి. చర్మ చక్షువులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ ఇంద్రజాలాన్ని ప్రదర్శిస్తున్నాయి.

మళ్లీ అతని దృష్టి అప్రయత్నంగా ఆమె వైపు మళ్లింది. ఆమె నిశ్చలంగా నిద్రిస్తున్నది. నిద్రలో కూడా ఆమె ముఖంలో చిరునవ్వు తొణికిసలాడుతూ ఆమె సౌందర్యానికి మరింత శోభ కూరుస్తున్నది. జైమిని హృదయంలో ఈ పర్యాయం ఏదో చెప్పనలవికాని చైతన్యం బయలుదేరింది.

అతడు రెప్పవేయకుండా ఆమెను చూస్తున్నాడు. తన జీవితంలో అతడు ఇటువంటి సౌందర్య రాశిని ఎన్నడూ చూసిఉండలేదు. బహుశా ఎప్పుడైనా చూచినా ఆ సౌందర్యోపాసన చేయాలన్న తలంపే అతనికి కలుగలేదు. కాని నేటి చిత్త ప్రవృత్తి మాత్రం కేవలం అందుకు భిన్నంగానే ఉన్నది. అతనిలో ఎన్నో ఏళ్లనుంచి నాటుకుని ఉన్న వేదాంత మహావృక్షం ఒక భయంకర భూకంపానికి పాతాళానికి అణగద్రొక్కబడింది. దానిస్థానే ప్రకృతి సహజమైన చివురుటాకుల రెమ్మలతో నవ్యత్వానికి నాందిగా మరొక చిన్న వృక్షం లేచింది. ఈ వృక్షశాఖలలో ఎక్కడ చూచినా కొల్లలుగా ఆనందం వెల్లివిరిసింది. అతనికి ప్రపంచమంతా ఒక బ్రహ్మాండమైన ఆనంద సీమగా కనిపిస్తున్నది. ఈ శుష్క వేదాంతం ఆశ్రమ నియమాలు కఠోర దీక్షలు అతనికి కేవలం నిష్ప్రయోజనంగా తృణప్రాయంగా కన్పించాయి. ఎక్కడో ఎప్పుడో అనుభవించబోయే స్వర్గ సౌఖ్యాల కాశించి అయాచితంగా స్వాగతమై ఉన్న అనిర్వచనీయానందానికి నీళ్లు వదులుకోవడానికి అతనికి ఇష్టం లేకపోయింది. కనీసం ఒక్కసారైనా ఆ మధురానుభూతిలో మోడువారిన తన హృదయంపై అమృతం చిలికించి సజీవ చైతన్యం నెలకొల్పాలని అతని మనస్సు ఉద్రూత లూగుతున్నది.

సరిగ్గా అదే సమయానికి ఆమె కన్ను విప్పి చూచింది. ఎదురుగా కూర్చుని ఆ బ్రహ్మచారి తనవైపే చూస్తున్నట్లు తెలుసుకొని ఆమె త్రొట్రుపాటుతో లేచి కూర్చుని సిగ్గు పడుతున్నట్లు ముఖం ప్రక్కకు తిప్పుకుంది.

జైమిని నిర్లజ్జతో తదేక దృష్టితో ఆమెను చూడ్డం మాత్రం మానలేదు. క్షణ క్షణానికి అతనిలో కామ వికార సంచలనం విజృంభిస్తూ అతనిని యుక్తాయుక్త విచక్షణాజ్ఞాన రహితునిగా చేసివేస్తున్నది. కాని అలా ఎంతోసేపు కాలేదు.

జైమిని మహావేగంతో కంపిస్తున్న హృదయాన్ని అదిమి పట్టుకొని వణుకుతున్న శరీరంతో లేచి ఆమెను సమీపించాడు. చరాలున ముందుకు వంగి ఆమె చేతులు పట్టుకొని లేవనెత్తి ఆమెను గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు. ఆమె ఏ విధమైన అభ్యంతరమూ చూపలేదు. పట్టు విడిపించుకోవడానికి పెనుగులాడలేదు కూడా. అంత సులభంగా ఆమె లొంగిపోవడంతో జైమిని ఉత్సాహానికి పట్టపగ్గాల్లేకుండా పోయాయి.

అతని సర్వాంగాలూ అతి చురుకుగా పని చేయడం మొదలుపెట్టాయి. పెదవులు దేనినో వెదుకుతున్నాయి. చేతులు లతల్లా ఆమె నడుమును పెనవేసుకుంటున్నాయి.

అయితే. . .

ఈ రసమయ ఘట్టానికి హఠాత్తుగా అనుకోని విఘ్నం ఏర్పడింది. అదే సమయంలో ఆ కుటీరానికి అతి సమీపంలో 'టకటక' మని పావుకోళ్ల చప్పుడు వినిపించింది. అది రానురాను అధికమై ఆ కుటీరాన్ని సమీపిస్తున్నట్లు స్పష్టమైంది. ఆ ధ్వని వ్యాస మహర్షి పాదరక్షలదని తెలుసుకొనడానికి జైమినికి ఎంతోసేపు పట్టలేదు. అతడు హతాశుడై ఆమెను విడిచిపెట్టి నేలపై కుప్పగా కూలిపోయాడు. భయంతో అవమాన వ్యథతో అతని ముఖం బాగా పాలిపోయింది. గురుదేవుల అకాల ఆగమనం అతని కోర్కెలకు గొడ్డలిపెట్టుగా పరిణమించింది.

పావుకోళ్ల చప్పుడు కుటీరాన్ని సమీపించి ఆగిపోయింది. వెనువెంటనే "జైమినీ!" అన్న పిలుపు శూలంలా అతని కర్ణేంద్రియాన్ని తాకింది.

జైమినికి ఏమి చెయ్యడమో తోచడం లేదు.

గురుదేవులు సరిగ్గా ఆ సమయానికే తిరిగి రావడం, అదీగాక సరాసరి తన కుటీరానికే రావడం అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసివేసింది. ఈ సంఘటన గురుదేవుల దృష్టిలో పడితే తన కెంత అవమానం! అయినా ఈ విషయాన్ని దాచటం అసంభవం. ఆయన సర్వజ్ఞులు. బహుశా ఈ విషయం తెలుసుకొనితనను మందలించడానికే వచ్చారేమో? అలా అయితే అంతకంటే మించిన పరాభవం మరొకటి లేదుకదా! "అయ్యో భగవంతుడా! నన్నెందుకీ క్షణికోద్రేకాలకు గురిచేసి పతితుని చేశావు? నా విజ్ఞానమంతా మట్టిలో కలిసిపోయింది కదా? ఇంకెందు కీ జన్మ? ఇంతటి ఘోర పరాజయాన్ని పొందిన తర్వాత కూడా ఇంకా జీవించి ఏమి ప్రయోజనం? రేపటినుండి నా మలినముఖాన్ని సోదర శిష్యులకు ఎలాచూపించగలను? అందుకే ఆ నాడు గురుదేవుల వారన్నారు—'స్త్రీ సాన్నిధ్యానికి సాధ్యమైనంత దూరంలో ఉండడం బ్రహ్మచారులకు అన్ని

పరమార్థం తెలుసుకోలేక సవాలు చేశాను. ఫలితం అనుభవించాను. పరమార్థం తెలుసుకున్నాను. కాని సమయం మించి పోయింది. గతజలసేతు బంధనమైంది. నేను పతితుడనైపోయాను. నావంటి అల్పులు కఠోర బ్రహ్మచర్య దీక్షకు అనర్హులు."

"జైమినీ! తలుపుతియ్యి." వ్యాస మహర్షి కంఠం ఖంగున మ్రోగింది.

జైమిని తొట్రుపాటుతో వెళ్లి తలుపు తెరిచాడు. లోపల అడుగు పెట్టబోతున్న వ్యాస మహర్షి పాదాలపై ఒక్కసారిగా వాలిపోయాడు.

"క్షమించండి గురుదేవా! నేనొక ఘోర అపరాధిని" అన్నాడు జైమిని వణుకుతున్న కంఠంతో. అతని కన్నులనుండి అశ్రుధారలు స్రవించి వ్యాస మహర్షి పాదాలను తడిపివేశాయి.

వ్యాసభగవానులు ప్రేమ పూర్వకంగా అతన్ని

# బ్రహ్మచారి

లేవనెత్తి, "లే జైమినీ! నిన్ను మనస్ఫూర్తిగా క్షమిస్తున్నాను. నీవు ఏ కృత్యాన్ని ఘోరా పరాధంగా భావించి మధనపడుతున్నావో ఆ కృత్యం వల్ల సంభవించిన అపవిత్రత నిన్ను అంటకుండు గాక!" అన్నాడు.

జైమినికి సంతృప్తి కలుగలేదు. తను చేసిన అపరాధం ఎటువంటిదో తెలుసుకొని ఉంటే *గురుదేవులు అంత సులభంగా తనను* క్షమించి ఉండరు. ఒకవేళ క్షమించినా అందుకు తాను అర్హుడు కాడు.


వ్యాసమహర్షి పర్ణశాలలో అడుగు పెట్టారు. అతనివెనుకనే భయం భయంగా అడుగు పెట్టిన జైమిని ఆశ్చర్యానికి మేరలేకపోయింది. ఆయువతి అకస్మాత్తుగా అదృశ్యమైంది. ఆమె ఇంత క్రితం పర్ణశాలలో ఉన్న సూచనలే లేకుండా పోయాయి. జైమిని అనుమానంతో మళ్లీ అంతా కలయ వెదికాడు. ఊహూ! ఆమె లేదు! ఏమైందో,ఎలా వెళ్ళిపోయిందో అర్థంకాక దిమ్మెర పోయినట్లు అలా చూస్తూ ఉండిపోయాడు.

ఇది గ్రహించి వ్యాస మహర్షి చిరునవ్వుతో అన్నారు: "ఆమె వెళ్లిపోయింది."

జైమిని గుండె ఝల్లుమన్నది. గురుదేవులు తన ప్రణయకలాపాన్ని పసిగట్టివేశారని తట్ట *గానే ఒక్కసారిగా అతని శరీరం గగుర్పొడిచింది.*

"జరిగినదానికి దిగులు పడుతున్నావా జైమినీ! ఇలాంటిది సంభవమని నే నన్నప్పుడు నీవు నాతో ఏకీభవించలేక పోయావుకదూ? అందుకే, స్త్రీ సాన్నిధ్యంలో ఎంతటి దృఢచిత్తమైనా ఎలా సడలిపోతుందో, విజ్ఞానం ఎలా



**బౌద్ధ స్థూపాలు (నాగార్జునసాగర్)** ఫోటో—ఘంటసాల ఈశ్వరరావు (బందరు)

హరించిపోతుందో నీకు అనుభవంలోనికి తేవాలనే ఉద్దేశ్యంతో ఈ నాటకాన్ని నేనే కల్పించాను" అన్నారు వ్యాసమహర్షి గంభీరంగా.

జైమిని సహనం కోల్పోయాడు. ఇదంతా గురుదేవుల కల్పనేనని తెలియగానే అతని సర్వాంగాలూ కోపంతో విచ్చుకున్నాయి. అతడు ఉద్రేకంతో వణకుతున్న కంఠంతో గురువు నుద్దేశించి ఇలా అన్నాడు:

"అయితే ఈ మోహినీ స్వరూపం—ఈ భయంకర ఝుం ఝూ మారుతం—ఈ విచిత్ర స్వప్నానుభూతులు—ఇవన్నీ కేవలం కల్పితాలేనా? ఇవన్నీ బుద్ధిపూర్వకంగా నన్ను వంచించి పతితుడుగా చేయడానికి సంకల్పించిన ప్రయత్నాలేనా?"

వ్యాసమహర్షి సూటిగా జైమిని ముఖంలోకి చూస్తూ మందలిస్తున్నట్లు అన్నారు:

"ఎవరూ ఎవరినీ వంచించలేరు జైమినీ! ఎవరి అంతరాత్మ వారినే వంచిస్తుంది. ఎవరి అజ్ఞాన తిమిరం వారి ప్రతిభనే హరిస్తుంది. సూర్యోదయంవల్ల అంధకారం పటాపంచలై చైతన్యవంతమైన ప్రకృతి ఎలా గోచరిస్తుందో అలాగునే జ్ఞానోదయంవల్ల అజ్ఞానాంధకారం మంచులా విడిపోయి యథార్థం స్పష్టంగా గోచరిస్తుంది. నిన్ను వంచించాలని గాని, నీకు గర్వభంగంచెయ్యాలని గాని నేను ఈ ప్రయత్నాలు చెయ్యలేదు. పరమ సత్యాన్ని ప్రత్యక్ష నిదర్శనాలతో నిరూపించి ముమ్ముందు వాటి ప్రభావానికి గురి కాకుండా నిన్ను రక్షించాలనే ఉద్దేశ్యంతో ఇదంతా చెయ్యవలసి వచ్చింది. శిష్యులను పరీక్షించే హక్కు గురువునకు ఉన్నది. శిష్యుడు పరీక్షలో ఉత్తీర్ణుడు కాలేకపోతే ఆ అసమర్థతకు గురువుకూడా సమానబాధ్యుడు. అయితే ఇందులో నాలోపం కూడా లేకపోలేదు. ఆ లోపాన్ని వెదికి వెలుపలకు తీసుకురావడానికి ఈ పరీక్ష నిర్దేశింపబడింది. అంతేగాని నిన్ను భంగపరచడానికికాదు."

జైమినికి మెల్లగా కనువిప్పు కలుగుతూంది. గురువును అపార్థం చేసుకుని తొందరపడి నోరు జారినందుకు అతనుమనస్సులో బాధపడజొచ్చాడు. అతనికోపం చల్లగా తిరోగమించింది.

వ్యాసమహర్షి మళ్లీ చెప్పుకు పోతున్నారు:

"ఎడారిలో ప్రయాణంచేస్తున్న బాటసారి ఎండమావులను చూచి జలాశయమని మొదట భ్రమించి అందుకోసం పరుగులెత్తి మోసపోతాడు. కానీ, తీరా ఒకసారి మోసాన్ని తెలుసుకున్న తరువాత తిరిగి ఆ ఎండమావులను చూసి జలాశతో 'పరుగు' లెత్తడు. క్షుద్రమైన లైంగిక వాంఛలలో ఏదో మాధుర్యం ఉందని భ్రమించి ఆ క్షణికానందాన్ని అనుభవించిన తర్వాత అందు విషయమై తాను వ్యర్థపుచ్చిన మహా తపశ్శక్తిని ఆ క్షణికానందంతో పోల్చి చూసుకొని, 'అయ్యో నేనెంత మూర్ఖుడను. ఎన్నోఏళ్లనుండి ఆర్జించిన తపోబలాన్ని ఒక క్షణంలో వ్యర్థం చేసుకున్నానే' అని మథన పడుతాడు ఆ వ్యక్తి. అలాగే, ఒకసారి ఈ ఇంద్రజాలంవల్ల మోసపోయిన నీ ఆత్మ ఇక ఎప్పుడూ అటువంటి మోసాలకు గురికాదు. నీ మనోబలం నాకు తెలియనిది కాదు. అయితే పరిస్థితుల ప్రభావానికి ఎంతటివారైనా ఒక్కొక్క సారి లొంగిపోక తప్పదు. రాత్రంతా ఈ ప్రయోగం ద్వారా నిన్ను కూలంకషంగా పరిశోధించాను. నీలో రెండు విభిన్న శక్తులు హోరాహోరీగా పోరాడుతున్నాయి. కాని దుష్టశక్తికే విజయం చేకూరింది. అందుకు కారణం పరిస్థితుల ప్రభావమే. అయితే జరిగినదానికి నీవు ఇప్పుడు ఎంతగా పశ్చాత్తాప పడతున్నావో నాకు తెలుసును. ఆ పశ్చాత్తాపమే భవిష్యత్తులో వజ్రకవచమై నిన్ను రక్షిస్తుంది. ఇంతవరకూ జరిగిన సంఘటనలు కేవలం కల్పితాలు. అందువలన వాటివల్ల నీకు సంక్రమించిన దోషం కూడా యథార్థమైనది కాదు. నీ ఆత్మ మునుపటివలె సంపూర్ణ పవిత్రతతో నిర్మలమై ఉండుగాక అని నేను ఆశీర్వదిస్తున్నాను."

జైమిని ఆనందానికి మేరలేదు. అతని హృదయంలోని వ్యథ అంతా ఒక్కసారిగా చేతితో తీసివేసినట్లు మాయమైంది. మనః ఫలకం మీద గాఢంగా ముద్రవేసుకొనిపోయిన దుర్ఘటనలన్నీ ఒక్కొటొక్కటిగా చెరిగిపోయాయి. వాటి స్థానే అపూర్వపు నైర్మల్యం జ్ఞానం చోటు చేసుకొన్నాయి.

జైమిని అమాంతంగా వ్యాసమహర్షి పాదాల వద్ద మోకరిల్లాడు. అతని పాద పద్మాలపై శిరస్సును ఆనించి తన భక్తిభావాన్ని వెల్లడి చేసుకొన్నాడు. అతని కన్నుల నుండి అప్రయత్నంగా ఆనందాశ్రువులు జలజలరాలి వ్యాసమహర్షి పవిత్ర పాద ద్వయంపై స్రవించాయి. ★